


# కరపత్రం

SINCE 2014

గురువారం ఏప్రిల్ 23, 2026 | సంపుటి : 2 | సంచిక : 192 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## కాళేశ్వరంపై ఎవ్వరికీ
# క్లీన్ చిట్ ఇవ్వలేదు

## హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు

» తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు

» సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,ఏప్రిల్ 22:**
కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్



ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని..

మిగతాద్ది 2 లో



## హైకోర్టు తీర్పు కాంగ్రెస్
# ప్రభుత్వానికి చెంపపెట్టు

- కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం
- అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు
- ప్రభుత్వ వైఫల్యాన్న బయటపెట్టిన హైకోర్టు తీర్పు
- విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 22 :**
కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు.

మిగతాద్ది 2 లో



## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

- హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,ఏప్రిల్22 :**
ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు.

2లో..



## ఈడీ విచారణలో జోక్యం.. మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ:**
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి,

## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి



» చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత

» మంత్రి కందుల దుర్గేశ్ తదితరుల సంతాపం

**హైదరాబాద్,ఏప్రిల్22 :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

2లో..

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను హైకోర్టు తప్పు పట్టలేదు



– టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్:**
కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనేది వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను గానీ, సంబంధిత నివేదికను గానీ, దర్యాప్తు తీరునుగానీ హైకోర్టు తప్పుపట్టలేదని, కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికను కూడా తప్పుపట్టలేదని అన్నారు.





## ఆర్టీసీ సమ్మెతో
# బస్సులకు రెస్ట్

- డిపోలకే పరిమితం అయిన బస్సులు
- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఫ్రగీ తిప్పిన ప్రభుత్వం
- చాన్నాళ్లకు ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులను పొడగించిన సర్కార్
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాట్లు ఎండి వెల్లడి

2 లో

**హైదరాబాద్,ఏప్రిల్22 :**
చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది.





## హైకోర్టు తీర్పుతో
# బుద్ధి తెచ్చుకోవాలి

» కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు

**హైదారబాద్,ఏప్రిల్22 :**
కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్ల మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై ఆయన హర్షణీయం వ్యక్తం చేశారు.

## సమ్మెతో సమస్యలు
# పరిష్కారం కావు

» వెంటనే సమ్మె విరమించి రండి

» ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

**హైదారబాద్,ఏప్రిల్22 :**
ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని



ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు.

2లో..




## ఆ రూ.3 వేలు తీసుకోకపోయి ఉంటే.. 26 మంది ప్రాణాలు నిలబడేవి

**ఢిల్లీ :**
పహల్గాం ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది. ఈ సందర్భంగా ఆ మారణహోమానికి సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఎన్ఐఏ విచారణలో తేలిన వివరాల ప్రకారం పహల్గాం ఉగ్రదాడి ముందు రోజు (ఏప్రిల్ 21, 2025 రాత్రి) ముగ్గురు పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఇద్దరు కాశ్మీర్ స్థానికులు ఫర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ ఆశ్రయం కల్పించారు. ఉగ్రవాదుల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చే అవకాశమున్నప్పటికీ, వారు చెప్పలేదు. ఇందుకోసం ఉగ్రవాదుల నుంచి రూ.3,000 తీసుకున్నట్లు విచారణలో బయటపడింది.

## 'కుంగింది కాళేశ్వరం కాదు..
# కేసీఆర్‌పై చేసిన కుట్రలు'



02

**హైదరాబాద్:**
కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు చేసిన వారికి హైకోర్టు తీర్పు చెంపపెట్టు" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇవాళ గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు..

# ఆర్టీసీ సమ్మెతో బస్సులకు రెస్ట్

మొదటి పేజీ తరువాయి
ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్- ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్- రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొన్ని సంఘాలు నిజాలను విస్మరించి కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె బాట పట్టింది. మంగళవారం నాడు అధికారులతో చర్చలు విఫలం కావడంతో ఆందోళనకు దిగారు ఆర్టీసీ కార్మికులు. బస్సులను డిపోలకే పరిమితం చేసి రోడ్లపై బైఠాయించి నిరసనలకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సమ్మె విరమించాలని కార్మికులను కోరుతోంది. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సులు నడపాలని సంబంధిత ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

మొదటి పేజీ తరువాయి
బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం ఫౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను హైకోర్టు తప్పు పట్టలేదు

మొదటి పేజీ తరువాయి
విధానపరమైన నిర్ణయాన్ని మాత్రమే తప్పుపట్టిందన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందనేది వాస్తవని చెప్పారు."కాళేశ్వరం దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లటం ఖాయం. హైకోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తదుపరి చర్యలకు వెళ్తుంది. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని భాజపా నేతలు అనలేదా? బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని మోదీ, అమిత్ షా గతంలో ఆరోపించారు. సీబీఐకి అప్పగిస్తే రెండ్రోజుల్లోనే దోషులను జైల్లో పెడతామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. సీబీఐ దర్యాప్తు కోరితే కేంద్రం చర్యలు తీసుకోలేదు. మరి సీబీఐ దర్యాప్తు ఎందుకు ప్రారంభం కాలేదో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి" అని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.

### సుప్రీంకోర్టుకు ప్రభుత్వం?

కాళేశ్వరం అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర మంత్రివర్గం గురువారం భేటీ కానుంది. హైకోర్టు తీర్పుపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

## ఈడీ విచారణలో జోక్యం.. మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి
ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది.బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం..ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది."ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి" అని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోన్న సంగతి తెలిసిందే.

## 'కుంగింది కాళేశ్వరం కాదు.. కేసీఆర్‌పై చేసిన కుట్రలు'

మొదటి పేజీ తరువాయి
కుంగింది కాళేశ్వరం కాదు.. కేసీఆర్‌పై చేసిన కుట్రలు. కక్ష కట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేసింది. ఎన్ని కమిషన్లు వేసి కుట్రలు చేసినా, ఎన్నిక అబద్ధాలు చెప్పినా.. తెలంగాణలో పారుతున్న ప్రతి నీటి చుక్క కేసీఆర్ ఇచ్చిందే" అని కేటీఆర్ తేల్చి చెప్పారు."అది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు.. పీసీసీ ఇచ్చిన రిపోర్ట్. కాళేశ్వరం మహత్యాన్ని కనబడకుండా దాచలేరు. మాపై బురదచల్లారు కానీ.. నిప్పులాంటి నిజం బయటకు వచ్చింది. మేడిగడ్డపై కూడా సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేశారు. రెండేళ్లలో ఎన్నో డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. 2014లో ఆనాడు సాగునీటి విస్తీర్ణం ఎంత? ఇప్పుడు ఎంత?. ఎల్అండ్‌టీపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేశారు. ఆగమేఘాల మీద ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టడం నిజం కాదా?. కమీషన్లకు కక్కుర్తిపడి ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టారు...ఎస్‌బీసీ కూలి.. కార్మికులు చనిపోతే ఇప్పటివరకు బయటకు తీయలేదు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోతే మాట్లాడరు?. కరీంనగర్‌లో చెక్‌డ్యాంలు పేలిస్తే ఎందుకు చర్యలు ఉండవు. కేసీఆర్‌పై కోపంతో రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టారు. రైతులకు కరెంట్, రైతుబంధు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం మంచిది కాదు" అని కేసీఆర్ హితవు పలికారు.

## కాళేశ్వరం కథ ముగియలేదు సిబిఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు

**- బిఆర్ఎస్ నేతల సంబరాలు ఎందుకో**
**- మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలువురికి నోటీసులు ఇవ్వలేదని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుబట్టలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ కమిషన్ విచారణ చేసి ఇచ్చిన నివేదికను కూడా హైకోర్టు తప్పుపట్టలేదన్నారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్ట్ కూలిపోయిందని.. లక్ష కోట్లు వృథా చేశారని టీపీసీసీ చీఫ్ మండిపడ్డారు. కమిషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, ఏటీఎంలా మారిందని అమిత్ షా, నడ్డా చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదా కిషన్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు చెప్పిన కొన్ని అంశాలను చూసి సంబరాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌పై మహేశ్ గౌడ్ మండిపడ్డారు. పీసీ గోష్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న ఎన్‌డీఎస్ఏ కూడా రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కాళేశ్వరంలో నిర్మాణ లోపాలు ఉన్నాయని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. హైకోర్టు ఎక్కడా కూడా బీఆర్ఎస్ అవినీతికి పాల్పడలేదని చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిందన్నారు. ఆలస్యమైనా దోషులు జైలుకు వెళ్లక తప్పదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## కాలేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం అన్ని నివేదికలు ఇదే చెప్పాయి

**- హైకోర్టు తీర్పుపై కోదండరామ్ వ్యాఖ్య**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఏసీ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని, లోపాలు ఉన్నాయని కాగ్, విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లు ఇచ్చాయని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. విచారణ చేయకపోతే సీబీఐదే తప్పవుతుందని టీజేఏసీ అధ్యక్షులు చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో తప్పు జరిగిందని తెలుస్తున్నప్పుడు చర్యలు తీసుకోడానికి ఇబ్బంది ఏంటని కోదండరాం ప్రశ్నించారు. 'బ్యారేజ్ నిర్మాణంలో పిల్లర్లు కుంగిపోయినవి మనకు కనిపిస్తుంది కదా... ఇంకేం కావాలి' అని అన్నారు. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు ఎవరకీ చెంపపెట్టు కాదని కోదండరాం స్పష్టం చేశారు.

## ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

**- ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

మొదటి పేజీ తరువాయి
ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళిశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

మొదటి పేజీ తరువాయి
ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

## మాజీ సిఎం నాదెండ్ల భాస్కర రావు మృతి

మొదటి పేజీ తరువాయి
1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం. 1980వ దశకంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో ఆయన కీలక పాత్ర పోషించారు. స్వల్పకాలం ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ, అంతకుముందు మంత్రిగా ఆయనకు పరిపాలనపై గట్టి పట్టు ఉండేది. చట్టసభల పనితీరుపై ఆయనకు అపారమైన అవగాహన ఉంది. గుంటూరు జిల్లా నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేశారు' అని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఆ రూ.3 వేలు తీసుకోకపోయి ఉంటే.. 26 మంది ప్రాణాలు నిలబడేవి

మొదటి పేజీ తరువాయి
ఆ రాత్రి ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షాక్, హబీబ్ తాహీర్ అలియాస్ జిబ్రాన్, హంజ్లా ఆఫ్ఘనీ అనే ముగ్గురు ఉగ్రవాదులు ఆయుధాలతో ఆ ఇద్దరి ఇళ్లకు వచ్చారు. వారు ఉర్దూ, పంజాబీ భాషల్లో మాట్లాడుతుండగా, పెద్ద దాడి జరగబోతుందనే విషయం స్థానికులకు అర్థమైంది. సుమారు ఐదు గంటల పాటు అక్కడే గడిపి, భోజనం చేసి, అవసరమైన వంట పాత్రలు, బ్లాంకెట్, టార్పాలిన్ షీట్ తీసుకెళ్లారు.
ఏప్రిల్ 22న మధ్యాహ్నం 12:30 వరకు ఫర్వేజ్, బషీర్ ఇళ్ల వద్దే ఉన్న ఉగ్రవాదులు ఆ తర్వాత బైసరీన్ వ్యాలీలో దాక్కున్నారు. అదే రోజు మధ్యాహ్నం 1 గంట సమయంలో ఫర్వేజ్, బషీర్ పహల్గాంలో టూరిస్టులను గుర్రాలపై బైసరీన్ వ్యాలీకి తీసుకెళ్లారు. అక్కడే మారణహోమం జరిగింది. దాడి జరుగుతున్నా తమకేం పట్టనట్లుగా అక్కడి నుంచి వెళ్లిపోయారని ఎన్ఐఏ విచారణలో తేలింది. జూన్ 22, 2025న ఎన్ఐఏ ఆ ఇద్దరు స్థానికులను అదుపులోకి తీసుకుని, ఛార్జ్‌షీట్‌లో వారి పేర్లను చేర్చింది.
ఫర్వేజ్, బషీర్ తీసుకున్న ఆ మూడు వేల రూపాయలే 26 మంది అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నాయి. ఘటన జరిగి ఏడాది గడిచినా, బాధితుల కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతూనే ఉన్నాయని, వారు కన్నీటి పర్యంతమవుతున్నారని తెలుస్తోంది.

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటి పేజీ తరువాయి
కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్నినాశనం చేయాలని అనుకుంటున్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఏప్రిల్ 23, 2026

# ఈస్ట్ ఇండియా కంపెనీ లాగా

# సౌత్ ఇండియా కంపెనీ ప్రారంభించిన రాజకీయ పార్టీలు

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**భారతదేశ భౌగోళికంగా ఐదు భాగాలు.**

**▪ భారతదేశమంటే ఉత్తరం, దక్షిణం మాత్రమే కాదు. తూర్పు, పడమర, మధ్య భారతదేశం గా పరిగణించబడుతూ ఉన్నది**

అనాదిగా మనదేశానిది ఒకే సంస్కృతి,ఒకే నాగరికత,ఒకే జీవన వ్యవస్థ భారత దేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా వైవాహిక వ్యవస్థ ఒకే రకంగా ఉంటుంది.ధార్మిక ఆచారాలన్నీ కూడా ఒకేరకంగా ఉంటాయి.ప్రాంతాలవారీగా ఆహార విహారాలు విభిన్నంగా ఉన్నప్పటికీ ఆచార వ్యవహారాల్లో ఏకరూప విధివిధానాలు ఉంటాయి.మన దేశం పైన విదేశీ దండయాత్రలు ప్రారంభమైన తర్వాత మన దేశ సంస్కృతి నాగరికతలపై తీవ్రమైన దాడి జరిగింది. ఆఫ్ఘన్, టర్కీ,మొగలాయిల దండయాత్రల వల్ల వారి వారి ఆచార వ్యవహారాలను మన పైన రుద్దడం ప్రారంభమైంది.
అదే రకంగా డచ్, పోర్చుగీస్ మరియు ఆంగ్లేయుల దాడులు, పాలనలతో మనదేశం వారి వారి నాగరికతలను మన పైన రుద్దడం ప్రారంభమైంది.దాదాపు వెయ్యేళ్ళు విదేశీ సంస్కృతీ నాగరికతల ప్రభావంతో మనదేశంలో ఆత్మ విస్మృతి భావాలు మెల్లమెల్లగా ప్రవేశించాయి.

**▪ ఆ విదేశీ భావజాలం ప్రభావం ఇంకా రాజకీయాల్లో కనిపిస్తూ ఉంది**

మన దేశ సామాజిక వ్యవస్థను, మన దేశ సంస్కృతిని, మన దేశ నాగరికతను చిన్నాభిన్నము చేసిన విదేశీయుల గత పాలనలోని చెడును మరిపింప చేయడానికి మనకు వారి సంస్కృతిని చరిత్రను బోధించడం ప్రారంభించారు.ఆ మైకంలో పడిపోయిన తరువాత తరాలలోని కొందరు ఇప్పటికి విదేశీ భావజాలాన్ని ఆరాధిస్తూనే ఉన్నారు. విదేశీయుల పాలనా రీతిని, విదేశీ నీతిని అనుసరిస్తూ మనవాళ్లు మన దేశ ఔన్నత్యాన్ని చిన్న చూపు చూస్తూ వచ్చారు. విదేశీ కుట్ర కోణంలో, విదేశీ మైకంలోనే ఇప్పటికీ కొందరు రాజకీయ నాయకులు కొట్టుమిట్టాడుతున్నారు.

**▪ దానికి తాజా ఉదాహరణ నిన్నటి మహిళా రిజర్వేషన్ బిల్లు పైన జరిగిన చర్చ**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికి "డి లిమిటేషన్" (నియోజకవర్గాల పునర్విభజన బిల్లు)ను సాకుగా చూపి పార్లమెంటులో జరిగిన తతంగం అందరికీ తెలుసు.ఉత్తర భారతదేశం ఆధిపత్యం కొనసాగించడానికి సీట్ల పెంపు ప్రక్రియ తో దక్షిణ భారతదేశానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయబోతున్నదని మీడియాలో చేసిన హడావిడి మనమందరం చూసాము.

**▪ భారతదేశంలోని మొత్తం 543 ఎంపీ స్థానాలలో ఇప్పుడు దక్షిణ భారత దేశ రాష్ట్రాల వాటా 129 మాత్రమేనని అనడం ప్రజలను వంచించడం అవుతుంది**

ఇదే విషయంపై తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రెస్ మీట్ లో చెప్పిన దాని ప్రకారం ఉత్తర భారత దేశానికి 414 ఎంపీ సీట్లు ఉన్నాయని, దక్షిణ భారతదేశానికి కేవలం 129 సీట్లు మాత్రమే ఉన్నాయని అనడం వాస్తవ దూరమైన ప్రచారం.
దక్షిణ భారతదేశ ఎంపీ సీట్లు 129 మినహా మిగిలిన 414 ఎంపీ సీట్లు మొత్తం ఉత్తర భారతదేశానివి అనడం తప్పు.

**▪ 414 ఎంపీ సీట్లు తూర్పు, పడమర, మధ్య భారత రాష్ట్రాలకు చెందినవి. అందులో ఉత్తర భారత దేశానికి చెందిన ఎంపీ సీట్లు కేవలం 151 మాత్రమే**

పార్లమెంట్లో అమిత్ షా ప్రకటించినట్లుగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రకారం ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెరుగుతాయి.
డి లిమిటేషన్ బిల్లు పైన పార్లమెంట్ లో జరిగిన చర్చ పైన సమాధానమిస్తూ కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా సీట్ల పెంపుపై ప్రభుత్వ ఆలోచనలు స్పష్టంగా దేశముందు ఉంచారు. ▪ **కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డి లిమిటేషన్ బిల్లు ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఇప్పుడున్న ఎంపీ సీట్లలో సగం పెంపుదల ఉంటుందని చెప్పారు**

దానిపై రేవంత్ రెడ్డి గారు ప్రెస్ మీట్ లో ఇచ్చిన వివరణ దేశాన్ని ప్రజలను తప్పుదారి పట్టించడం అవుతుంది.

**▪ "డి లిమిటేషన్" వల్ల ఉత్తర భారతదేశానికి అధికమైన సీట్ల పెంపు జరుగుతుందని, దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని అన్నారు**

దానికి ఉత్తర్ ప్రదేశ్ ను, కేరళం ను ఉదాహరణగా చూపించారు.ఉత్తర్ ప్రదేశ్ లో ప్రస్తుతం 80 ఎంపీ




సీట్లు ఉన్నాయి, కేరళం లో 20 ఎంపీ సీట్లు ఉన్నాయి.యూపీ మరియు కేరళ కు 60 సీట్ల వ్యత్యాసం ఉంది అని, కేంద్ర ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం సగం సీట్లు పెరిగితే ఉత్తర ప్రదేశ్ కు 120 సీట్లు లభిస్తాయని, కేరళం కు 30 సీట్లు లభిస్తాయని అప్పుడు 90 సీట్ల వ్యత్యాసం ఉంటుందని అన్నారు. ఈ లెక్కన దక్షిణ భారతదేశానికి ఉత్తర భారతదేశానికి ఎంపీ సీట్ల పెంపుదల లో విపరీతమైన వ్యత్యాసం పెరిగిపోయి రాజకీయంగా నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి గారు అన్నారు.

**▪ రేవంత్ రెడ్డి చెప్పిన దాని ప్రకారం ఉత్తర భారతదేశానికి 414 ఒక ఎంపీ సీట్లకు 50 శాతం అదనంగా కలిస్తే ఉత్తర భారత దేశంలో 601 ఎంపీ సీట్లు అవుతాయని, దక్షిణ భారత దేశంలోని అన్ని రాష్ట్రాల ఎంపీ సీట్లు 129 కి 50 శాతం అదనంగా కలిస్తే 194 ఎంపీ సీట్లు మాత్రమే దక్కుతాయని అన్నారు**

డి లిమిటేషన్ కు రేవంత్ రెడ్డి గారు ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు.దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ వల్ల జనాభా పెరుగుదలలో ఉత్తర భారతదేశంతో వెనుకబడి ఉందని కాబట్టి రాష్ట్రాల ఆదాయ ప్రాతిపదికన సీట్లు పెంచాలని అనడం పట్ల రాజనీతిజ్ఞులు రేవంత్ రెడ్డి గారి ప్రస్తావనను తీవ్రంగా విమర్శిస్తున్నారు.

**▪ మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియం) అమలును వేగవంతం చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. అయితే, లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ లభించకపోవడంతో ఇవి 17 ఏప్రిల్ 2026 రోజున వీగిపోయాయి.**

**▪ మహిళా రిజర్వేషన్లతో అనుసంధానించబడిన ఆ మూడు ప్రధాన బిల్లులు**

**▪ 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026: మహిళా రిజర్వేషన్ల అమలులో ఉన్న అడ్డంకులను తొలగించి, వాటిని త్వరగా అమలు చేయడానికి ఉద్దేశించిన సవరణ ఇది.**

**▪ డీలిమిటేషన్ బిల్లు, 2026 (నియోజకవర్గాల పునర్విభజన బిల్లు): కొత్త జనాభా గణన కోసం వేచి చూడకుండానే, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభ సీట్లను పెంచడం ద్వారా మహిళా కోటాను అమలు చేయాలన్నది దీని ప్రధాన లక్ష్యం.**

**▪ కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026: కేంద్ర పాలిత ప్రాంతాలలో కూడా మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఈ బిల్లును ప్రతిపాదించారు.**

**▪ మహిళ రిజర్వేషన్ బిల్లుకు అనుసంధానించబడ్డ "డి లిమిటేషన్" బిల్లు పైన దక్షిణాది రాష్ట్రాలు, బిజెపి వ్యతిరేక రాజకీయ పార్టీల వైఖరి అసంబద్ధంగా ఉన్నది**

డీ లిమిటేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని మహిళా రిజర్వేషన్ అంశాన్ని వ్యతిరేకించిన రాజకీయ పార్టీల అసలు రంగు సామాన్య భారతీయులకు మెల్లమెల్లగా అర్థమవుతున్నది.
"డి లిమిటేషన్" అంశాన్ని అడ్డం పెట్టుకొని ఉత్తర భారత, దక్షిణ భారత విభజన వాదన లేవదీసిన రాజకీయ పార్టీల మనస్థితిని చూసి ఆశ్చర్యం కలుగుతున్నది.సామాన్య భారతీయులకు వీరి వ్యూహాలు, ఎత్తుగడలు అర్థం కావు అనుకొని తమిళనాడు ఐవీఖ ముఖ్యమంత్రి స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ, సమాజ్ వాది పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఆడిన ఆడుతున్న నాటకంతో సాధించింది శూన్యం. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక పార్టీల వాదన అశాస్త్రీయమైనది. ప్రతిపక్షాలది పూర్తిగా మహిళా వ్యతిరేక వైఖరి.పార్లమెంట్ సీట్ల పెంపుదల లో ఉత్తర భారతం దక్షిణ భారతం అనే వాదన అశాస్త్రీయం.దేశంలో ఈ ప్రాంత విభేదాలు విదేశీ పాలనలోని కురీతులను, ఈ రాజకీయ పార్టీలు నాయకులు మళ్లీ మనకు గుర్తు చేస్తున్నారు.

**▪ నాటి తెల్లవారికి, నేటి నల్లవారికి తేడా ఏమున్నది?**

**▪ ఉత్తర భారత, దక్షిణ భారత ఎంపీల గణాంకాలు ప్రజల ముందు ఉంచిన రేవంత్ రెడ్డి గారి మాటల్లో ముఖ్యమైనవి రెండు అంశాలు**

**▪ మొదటిది..ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్ల పెంపు చేస్తామని బిల్లును ప్రతిపాదించిన భారత హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పిన దానిని వక్రీకరించి మాట్లాడడం**

**▪ రెండవది.. రాష్ట్రాల ఆదాయ ప్రాతిపదికన సీట్లు పెంచాలని కోరడం**

రేవంత్ రెడ్డి మాట్లాడిన ఈ రెండు అంశాల లోతుల్లోకి వెళితే రాజకీయ పార్టీల అవగాహనపై నవ్వు వస్తున్నదని, అసహ్యం వేస్తున్నదని రాజకీయ పండితులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**▪ ప్రపంచంలో ఏ దేశంలో కూడా రెవెన్యూ ఆదాయ ప్రాతిపదికన సీట్ల నిర్ణయం జరగదు. కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల విభజన జరుగుతుంది**

భారత దేశం కేవలం రెండు భాగాలుగా మాత్రమే ఉంది, ఉత్తరభారతం దక్షిణభారతం అని పదేపదే మాట్లాడడం రాజకీయ పార్టీలకు అలవాటయింది.

**▪ భారతదేశ కేవలం ఉత్తర దక్షిణ భాగాలుగా మాత్రమే లేదు. భారతదేశంలో తూర్పు, పడమర,మధ్య భారత భూభాగాలు కూడా ఉన్నాయి**

దేశాన్ని ఇలా భాగాలుగా చేసి మాట్లాడడం మొదలయ్యింది ఆంగ్లేయుల పాలనలో.

**▪ వ్యాపారం పేరుతో భారతదేశానికి వచ్చిన ఆంగ్లేయులు "ఈస్ట్ ఇండియా కంపెనీ" ప్రారంభించారు.**

ఈస్ట్ ఇండియా కంపెనీ ఆర్థిక విషయాలను అడ్డం పెట్టుకొని ఈ దేశంలోని పాలకుల అనైక్యతను ఆసరాగా చేసుకుని తన సామ్రాజ్యాన్ని భారతదేశంలో స్థాపించింది బ్రిటన్

**▪ తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఆదాయం ప్రాతిపదికన ఎంపీ సీట్లు పెంచాలని అనడం ఆంగ్లేయుల పాలనా రీతిని, ఆంగ్లేయుల వారసత్వాన్ని గుర్తుకు తెచ్చింది**

**▪ బ్రిటిష్ వారి ఈస్ట్ ఇండియా కంపెనీ లాగా, కాంగ్రెస్ వాళ్లు సౌత్ ఇండియా కంపెనీ వాదన లేవదీశారు**

భారత రాజకీయాల్లో, దేశ పాలనలో ఉత్తర భారతదేశం యొక్క ఆధిపత్యము ఉంది అని అనడం నిజం కాదు. దక్షిణ భారత రాష్ట్రాల మొత్తం ఎంపీ సీట్లను దేశంలోని మిగతా సీట్లతో పోల్చి మాట్లాడడం హేతుబద్ధంగా లేదు.1960 ప్రాంతంలో తమిళనాడులో ఉత్తర భారత దేశ వ్యతిరేక వాదం తీవ్రంగా ప్రచారం జరిగినప్పటి నుండి దక్షిణ భారతదేశం అనే వాదన మొదలయ్యింది.

**▪ ద్రవిడ వాదం పేరుతో తమిళనాడులో మొదటగా దేశంలో విభజన రాజకీయాలకు బీజం పడింది. హిందీ వ్యతిరేకత, హిందూ వ్యతిరేకత పేరుతో దక్షిణ భారత దేశంలోని తమిళనాడులో ద్రవిడ వాదం వెర్రి తలలు వేసింది**

**▪ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆర్థిక సూత్రీకరణతో భారతదేశాన్ని గుప్పిట్లోకి తీసుకున్నట్టుగా, ఇప్పుడు ఆంగ్రేయుల దారిలోనే ఆర్థిక ప్రాతిపదికన దక్షిణ భారత ఎంపీ సీట్ల పెంపుదల కోరడము పూర్తిగా బానిస మనస్తత్వం**

**▪ అసలు దేశం ఉత్తర భారత ఆధిపత్యం లో ఉందా? ఉత్తర భారత మంటే ఎన్ని రాష్ట్రాలు?**

**▪ మనం ఇప్పుడు మొత్తం భారతదేశంలోని తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ,మధ్య భాగాలుగా రాష్ట్రాల వారీగా ఎంపీ సీట్ల సంఖ్యను చూద్దాం.**

**▪ భారతదేశంలో 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి**

**– ఉత్తర భారత రాష్ట్రాలు & ఎంపీ స్థానాలు**
**ఉత్తర ప్రదేశ్: 80..రాజస్థాన్ : 25..**
**పంజాబ్: 13..హర్యానా: 10..హిమాచల్ ప్రదేశ్: 4..**
**ఉత్తరాఖండ్ : 5**
**– ఉత్తర భారత కేంద్రపాలిత ప్రాంతాలు**
**ఢిల్లీ: 7..జమ్మూ & కాశ్మీర్: 5..లడఖ్: 1..చండీగఢ్: 1**
**– మొత్తం ఉత్తర భారత ఎంపీ స్థానాలు 151**
**నోట్: బీహార్ రాష్ట్రం భౌగోళికంగా మరియు పరిపాలనాపరంగా తూర్పు భారతదేశంలో** (East India) **భాగంగా పరిగణించబడుతుంది**

**దక్షిణ భారత రాష్ట్రాలు**
**తమిళనాడు: 39..కర్ణాటక: 28..ఆంధ్రప్రదేశ్: 25..కేరళ: 20..తెలంగాణ: 17**

**– దక్షిణ భారత కేంద్రపాలిత ప్రాంతాలు**
**పుదుచ్చేరి: 1..లక్షద్వీప్: 1..**
**అండమాన్ మరియు నికోబార్ దీవులు: 1..**
**దాద్రా మరియు నగర్ హవేలీ మరియు డామన్ మరియు దయ్యూ: 2.**
**– మొత్తం ఎంపీ స్థానాలు 132**
**మద్య భారత రాష్ట్రం**
**మధ్యప్రదేశ్: 29**

**నోట్:** మధ్య ప్రదేశ్ రాష్ట్రం భౌగోళికంగా దేశం మధ్య భాగాన ఉన్నప్పటికీ, భాష మరియు సంస్కృతి పరంగా ఇది ఉత్తర భారతదేశంతో అనేక పోలికలను కలిగి ఉంటుంది.

**తూర్పు భారత రాష్ట్రాలు**
పశ్చిమ బెంగాల్ : 42 స్థానాలు..బీహార్: 40..ఒడిశా : 21 స్థానాలు..జార్ఖండ్ : 14 స్థానాలు.. చత్తీస్ ఘడ్:11.

**▪ ఈశాన్య రాష్ట్రాలు**
అస్సాం:14..అరుణాచల్ ప్రదేశ్: 2..మణిపూర్: 2..మేఘాలయ: 2..త్రిపుర: 2..నాగాలాండ్: 1..మిజోరాం: 1..సిక్కిం: 1 ..
**▪ మొత్తం తూర్పు భారత ఎంపీ స్థానాలు:153**

**పశ్చిమ భారత రాష్ట్రాలు**
మహారాష్ట్ర: 48..గుజరాత్: 26.. గోవా: 2.
కేంద్ర పాలిత ప్రాంతం
దాద్రా & నగర్ హవేలీ మరియు డామన్ & దయ్యూ: 2

**▪ మొత్తం పశ్చిమ భారత ఎంపీ స్థానాలు:78**

మన భారతదేశం భౌగోళిక రూపం స్పష్టంగా ఉన్నప్పటికీ, ద్రవిడ వాద ప్రభావంతో కేవలం "ఉత్తరం దక్షిణం" అంటూ గారాలు పోయే, గీరాలు పలికే రాజకీయ నాయకులను పశ్చిమబెంగాల్ మహారాష్ట్ర రాజకీయ పార్టీలు సమర్థిస్తాయా?

**▪ పశ్చిమ బెంగాల్ ను, ఒరిస్సాను, అస్సాం ను, మహారాష్ట్రను ఉత్తర భారత రాష్ట్రాల జాబితాలో వేస్తే వాళ్లు ఒప్పుకుంటారా?.. దక్షిణ భారత రాజకీయ నాయకుల తో తూర్పు పశ్చిమ రాజకీయ నాయకులు కలిసి వస్తారా?**

**▪ భారత దేశం భౌగోళికంగా ఐదు భాగాలుగా ఉన్నప్పటికీ "ఉత్తర భారత దేశం" పై ద్వేషం ఎందుకు**
ఆంగ్లేయుల భావ దాస్యం ఇంకా ఎందుకు?.

**▪ కాంగ్రెస్ పార్టీని ఆంగ్లేయ అధికారులు ప్రారంభించారు**

భారతదేశంలో ప్రస్తుతం రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతి ప్రాంతీయ పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీ నుండి విడిపోయినవే. కాంగ్రెస్ పార్టీ మరియు ఈ ప్రాంతీయ పార్టీల ప్రతి కార్యక్రమం ఒకేలాగా కనిపిస్తాయి. వీరందరి భాషా భావజాలం ఒకే రకంగా ఉంటుంది.

**▪ ఉత్తర భారతదేశం దక్షిణ భారతదేశం అంటూ దేశాన్ని విభజించి చూసే వాళ్లకు, తూర్పు పశ్చిమ మధ్య భారత దేశం కూడా కనిపించాలి**

మహారాష్ట్రలో శివసేన పార్టీ ప్రారంభించిన తొలినాళ్లలో ఉత్తర భారతదేశం వాళ్లను తరిమి వేయాలని, దక్షిణాది వారిని మహారాష్ట్ర నుండి బయటకు పంపించాలని ఉద్యమించిన విషయము అందరికీ తెలుసు. మహారాష్ట్ర ఉత్తరభారతానికి కానీ, దక్షిణ భారతదేశానికి గాని చెందదు. ఆ రాష్ట్రం పశ్చిమ భారతదేశంలో భాగం.అలాగే పశ్చిమ బెంగాల్ కానీ, ఒరిస్సా కానీ తమను తాము ఉత్తర భారతీయులుగా భావించరు. ఈ రెండు కూడా తూర్పు,భారత దేశానికి చెందిన రాష్ట్రాలు

**▪ రాజకీయ పార్టీలు ఒక దేశాన్ని ఒక జాతిని నిర్మించాలి. భారతదేశంలోని ప్రతి రాజకీయ పార్టీ కూడా భారతీయుల మధ్య ఐక్యతా భావాన్ని పెంచాలి**

కేవలం రాజకీయ అధికారం కొరకు మాత్రమే పాకులాడే ఈ పార్టీలు దక్షిణ భారతదేశం, ఉత్తర భారతదేశం అంటూ చేస్తున్న విభజన వాద ప్రచారాన్ని నూతన తరం ఇష్టపడడం లేదు. ఈ విభజన వాదాన్ని యువతరం వ్యతిరేకిస్తున్నది.

**▪ ఇది నవీన భారతం**
నియోజకవర్గాల పునర్విభజన బిల్లును దేశ హితం కొరకు కాకుండా, తమ రాజకీయ ఉద్దేశాలతో ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడం పట్ల ప్రతి భారతీయుడు బాధపడుతున్నాడు.

**▪ డి లిమిటేషన్ బిల్లు గా పార్లమెంట్ లో ప్రవేశపెట్టబడిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఒప్పుకోమంటూ.. మహిళా రిజర్వేషన్ బిల్లును మంటగలపడం ప్రతిపక్ష పార్టీల తప్పిదం**

**▪ ప్రపంచంలో ఏ దేశంలోనూ ఆర్థిక లేదా పన్నుల వసూలు ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరగదు. మరి భారతదేశంలో రాష్ట్రాల ఆదాయ ప్రాతిపదికన సీట్లు కోరడము పూర్తిగా అవివేకం కాక ఇంకేమిటి?**

రాజకీయాలంటే అరుపులు మాత్రమే అని అందరికీ అర్థమైంది.
వివేకం లేని దూరదృష్ట లేని రాజకీయ పార్టీల వల్ల దేశానికి మేలు కంటే కీడు ఎక్కువ జరుగుతుంది.

**▪ ఉత్తరభారతం దక్షిణభారతం అనే వాదన ఇకపై చెల్లకూడదు**

పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉన్నప్పుడే ఎలాంటి రాజ్యాంగ సవరణ అయినా జరుగుతుంది.
సాధారణ మెజారిటీతో రెండేళ్ల కింద భారత పార్లమెంటులో ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ బిల్లు అంకెల గారడీలో ఓడిపోయింది.
"ఆకాశంలో సగం" Women Hold Up Half the Sky అనే పదబంధం భారత పార్లమెంట్ లో ఓడిపోయింది. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో వీగిపోయింది. సమాజంలో స్త్రీలకు సమాన హక్కులు, అవకాశాలు ఉన్నాయని తెలియజేసే ఒక ప్రసిద్ధ సామెత భారత పార్లమెంటులో మంటగలిసింది

**▪ స్త్రీలకు సమాన హక్కులు అనే మాట పక్కన పెడితే, భారత రాజకీయాల్లో స్త్రీలకు కనీసం 33 శాతం వాటా కూడా ఇవ్వలేని రాజకీయ పార్టీల తీరు పట్ల మహిళలు మండిపడుతున్నారు. ప్రగతిశీల భారత పురుష సమాజం కూడా కోపంతో రగిలిపోతున్నది**

మహిళా రిజర్వేషన్ బిల్లు ను పార్లమెంటులో అడ్డుకున్న ప్రతి రాజకీయ పార్టీ ప్రజాక్షేత్రంలో ప్రజానిరసనను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**ఓ మహిళా మేలుకో..**
**నీ దేశాన్ని ఏలుకో**

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం ఏప్రిల్ 23, 2026

# జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా మ్యాకమల్ల అశోక్ నియామకం

▪ ప్రణవ్ బాబు చేతుల మీదుగా ఘన సన్మానం

**జాతీయ భూమి ప్రతినిధి జమ్మికుంట:ఏప్రిల్ 22**

ఇటీవల ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ నియామకాల్లో భాగంగా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మ్యాకమల్ల అశోక్‌ను జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందాన్ని కలిగించింది.



బుధవారం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో అశోక్‌కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో, నిజాయితీగా పని చేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని, మ్యాకమల్ల అశోక్ నియామకం దానికి నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అశోక్ మరింత కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ ఉన్నత నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి, సుంకరి రమేష్, ములుగురి సదయ్య, ఎగేటి కుమారస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశు రాం రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల సాంబశివారెడ్డి, సాయిని రవి, మేకమల్ల వెంకటేష్, జమ్మికుంట 11వ వార్డు కౌన్సిలర్ పొన్నగంటి విష్ణువర్ధన్, మాజీ కౌన్సిలర్ రావికంటి రాజు తదితరులు పాల్గొన్నారు

# ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన అవమానకర వ్యాఖ్యలకు నిరసనగా మేడ్చల్ డివిజన్ బీజేపీ నాయకులు హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరిలో బుధవారం ఆందోళన చేపట్టారు. బీజేపీ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు జెల్లీ శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పై అవమానకర వ్యాఖ్యలు చేయడం అనుచితమని నాయకులు ఖండించారు. కాంగ్రెస్ అధిష్టానం వెంటనే ఖర్గేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి సుధాకర్ రెడ్డి, జాకట ప్రేమ్ దాస్, రమణగారి శ్రీనివాస్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ నేతల మద్దతు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమవ్వడంతో కార్మిక జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ ఉప్పల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మద్దతు తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి కీలక చర్యలు తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు.



# డివైడర్‌ను ఢీకొట్టి యువకుడికి తీవ్ర గాయాలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**



ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో జాతీయ రహదారి 44 పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతివేగంతో వెళ్తున్న బైక్ డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.4

# ఇల్లందకుంటలో ఉద్రిక్తత... ఒకే కులానికి చెందిన రెండు వర్గాల మధ్య ఘర్షణ, 10 మందిపై కేసులు

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 22**

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట గ్రామంలో రహదారిపై ఒకే కులానికి చెందిన రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుని గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వ్యక్తిగత వివాదం కాస్త పెద్ద గొడవగా మారి, ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. పరస్పరం దూషణలు, తోపులాటలు జరగడంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు భయాందోళనకు గురయ్యారు.ఈ సంఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఇల్లందకుంట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణను చల్లార్చి ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. సంఘటనలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి విచారణ చేపట్టారు.

ప్రాథమిక సమాచారం మేరకు, ఇరు వర్గాల మధ్య కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అదే వివాదం మళ్లీ చెలరేగి ఈ ఘర్షణకు



దారితీసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనలో కొంతమందికి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం.

ఈ ఘటనపై ఇల్లందకుంట ఎస్సై ఎం. క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేయబడింది. గొడవలో పాల్గొన్న 10 మందిపై భారతీయ న్యాయ సంహిత (బీ ఎన్ ఎస్ ) సెక్షన్ 194 కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను విచారించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూ శాంతి భద్రతలు కాపాడేందుకు చర్యలు చేపట్టారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులతో పోలీసులు సమావేశమై పరస్పర సామరస్యంతో ఉండాలని సూచించారు.

చిన్న చిన్న వ్యక్తిగత వివాదాలు పెద్ద గొడవలకు దారితీయకుండా గ్రామస్థులు సహనం పాటించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి అదుపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# మహిళ సమైక్య భవన నిర్మాణానికి పూజ చేసిన ఆరెగూడెం సర్పంచ్ చైతన్య హనుమంత్ రెడ్డి మాజీ సర్పంచ్ పల్వంచ శేఖర్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 22**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఆరెగూడెం గ్రామపంచాయతీలో మహిళా సమైక్య భవన నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేన్నవరం చైతన్య ఉపసర్పంచ్ పల్వంచ దుర్గయ్య. మాజీ సర్పంచ్ పల్వంచ శేఖర్ వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాదిగపు నర్సింలు కుక్కల జోకులు చాకలి సత్తయ్య కుస్తీ సుజాత చకలి కళావతి కుస్తీ సంతోష పంచాయతీ సెక్రెటరీ అశోక్ టిఆర్ఎస్ కార్యకర్తలు వేన్నవరం రాజిరెడ్డి బొట్టే అంజనేయులు చాకలి ఏసయ్య గ్రామ పెద్దలు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరెగూడెం గ్రామం అభివృద్ధి చెందాలి అంటే గ్రామ ప్రజల సహకారమే కాకుండా అధికారులు నాయకుల సహకారం ఎంతో ఉండాలని మన ఆరెగూడెం గ్రామ ప్రజల సహకారం ఉంటేనే మన అరె గూడెం గ్రామపంచాయతీని అభివృద్ధి చేసుకోవాలి గ్రామ ప్రజల సహకారం ఉంటేనే అభివృద్ధి చెందుతుందని గతంలో ఉమ్మడి వెల్దుర్తి గ్రామపంచాయతీ గా ఉన్నప్పుడు ఆరగుడం ఎటువంటి అభివృద్ధి చెందలేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత





గ్రామపంచాయతీలుగా ఏర్పాటు అయిన అనంతరం చిన్న గ్రామాలు కూడా ఎంతో అభివృద్ధి చెందాయని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన అనంతరం ఆరెగూడెం గ్రామపంచాయతీగా ఏర్పాటు అయిన తొలి దశలో తాను సర్పంచ్ గా పల్వంచ శేఖర్ అయిన నేను సర్పంచ్ గా గెలిపించుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో అంగన్వాడి కేంద్రాలను మహిళ సమైక్య భావన నిర్మాణం నిర్మించడం ఎంతో సంతోషకరమైన విషయమని చెప్పుకోవచ్చు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనిలో భాగంగా ఆరెగూడెం గ్రామ పంచాయతీకి మహిళా సమైక్య భవన నిర్మాణ పూజ కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహించడం జరిగిందని ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కూడా మా చిన్న గ్రామ పంచాయతీకి ఎన్నో అభివృద్ధి పనులను ఇవ్వాలని పత్రిక ముఖంగా కోరుకుంటున్నామని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గయ్య మాజీ సర్పంచ్ శేఖర్ వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాదిగపు నర్సింలు కుక్కల జోగులు చాకలి సత్తయ్య కుస్తీ సుజాత చాకలి కళావతి కుస్తీ సంతోష గ్రామపంచాయతీ సెక్రటరీ అశోక్ బిడి ఆర్ ఎస్ వెన్నవరం రాజిరెడ్డి బొట్టే ఆంజనేయులు చాకలి యేసయ్య గ్రామ ప్రజలు పలు పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్‌పై ఉద్రిక్తత

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అరెస్ట్
- నాయకులు, కార్యకర్తల భారీగా అదుపులోకి
- “అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు” -- బీజేపీ హెచ్చరిక

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:ఏప్రిల్ 22**

హుజురాబాద్ పట్టణంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకోవడం జరిగింది.



డంపింగ్ యార్డ్‌ను హుజురాబాద్‌లో ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. నివాస ప్రాంతాలకు సమీపంలో చెత్త మైదానం ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం పెరిగి, ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు.

ఆందోళన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిరసనకారులను చెదరగొట్టేందుకు చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే బీజేపీ నాయకులు ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# అక్రెడిటేషన్ల జారీలో సర్కారు అట్టర్ ఫ్లాప్

▪ పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటం అవసరం -- మామిడి సోమయ్య

**కరపత్రం ప్రతినిధి మహబూబ్ నగర్, ఏప్రిల్ 22:**

రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన కొత్త అక్రెడిటేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

బుధవారం మహబూబ్ నగర్ పట్టణంలోని కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ భవన్‌లో నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశానికి మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు





వాకిట అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం చూపుతున్న వివక్ష గతంలో ఎన్నడూ లేనిదని అన్నారు. గత రెండు సంవత్సరాల్లో జర్నలిస్టుల సమస్యల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదని విమర్శించారు.

అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని ప్రభుత్వం పదేపదే చెప్పినా, అది మాటల్లోనే మిగిలిపోతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో కూడా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు.

చిన్న, మధ్య తరహా పత్రికలకు రెండేళ్లుగా ప్రభుత్వ ప్రకటనల బిల్లులు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, ఎం. యాదగిరి, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు మోయిజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ రఫీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ్మా, కార్యదర్శి ఎం. గోపాల్, కోశాధికారి నర్సింహులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవి కుమార్, కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.